క్లుప్తంగా

అన్నవరప్పాడులో భక్తుల రద్దీ



విశేష అలంకరణలో వేంకటేశ్వరస్వామి వారు

పెరవలి: కార్తిక శనివారం కావడంతో అన్నవరప్పాడు గ్రామంలోని వేంకటేశ్వర స్వామి వారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. స్వామి, అమ్మవార్లను వివిధ రకాల పూలతో శోభాయమానంగా అలంకరించారు. వేకువ జామునే పెద్ద ఎత్తున మహిళలు ఆలయానికి వచ్చి, పుణ్య స్నానాల అనంతరం కోనేరులో కార్తిక దీపాలు వదిలారు. స్వామి వారికి అభిషేకం అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఉదయం ఏడు గంటల తర్వాత భక్తుల రద్దీ పెరగడంతో స్వామివారి దర్శనానికి సుమారు గంట సమయం పట్టింది. భక్తులకు ఉదయం ఉచిత ప్రసాదాలు పంపిణీ చేశారు. ఉదయం 10 గంటల నుంచి అన్న సమారాధన నిర్వహించారు. దాత రుద్ర శ్రీను, జ్యోతి దంపతుల చేతుల మీదుగా ఈ కార్యక్రమం ప్రారంభమైంది. సుమారు ఆరు వేల మంది భక్తులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారని ఆలయ ఈఓ మీసాల రాధాకృష్ణ తెలిపారు.

తెలుగు మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



గోపాలపురంలో తెలుగు మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

గోపాలపురం: వచ్చే ఏడాది జనవరి 5,6,7 తేదీల్లో రాజమహేంద్రవరం సమీపంలోని గైట్ కళాశాలలో నిర్వహించే రెండో అంతర్జాతీయ తెలుగు మహాసభలను విజయవంతం చేయాలని ఉత్సవ కమిటీ సభ్యుడు రాపాక ఫణికిషోర్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఆంధ్ర సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ మహా సభలకు సమన్వయకర్త కేసిరాజు రామ్‌ప్రసాద్ సూచనల మేరకు ఏర్పాట్లు చేస్తున్నట్టు ఫణికిషోర్ చెప్పారు. కాగా తెలుగు మహా సభల పోస్టర్‌ను శనివారం గోపాలపురంలో ఉపాధ్యాయులు ఆవిష్కరించారు.

బీమా తక్షణ సాయం అందజేత



బీమా తక్షణ సాయం అందిస్తున్న అనంతపల్లి సర్పంచ్ కమలకుమారి

నల్లజర్ల: మండలంలోని అనంతపల్లి గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో పెనుమాక ప్రసాద్, రోడ్డు ప్రమాదంలో అవిర్ని శ్రీనివాస్ అనే రైతు ఇటీవల వృతి చెందారు. ఈ రెండు కుటుంబాలకు వైఎస్సార్ బీమా తక్షణ సాయం ఒక్కో కుటుంబానికి రూ.10 వేల చొప్పున శనివారం సర్పంచ్ కమలకుమారి అందజేశారు. సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ సీహెచ్ సుధీర్ కుమార్, ఏడీ పావని, వలంటీర్లు రాజేశ్వరి, సుధారాణి ఉన్నారు.

లోక్ అదాలత్‌లో రూ.38.89 లక్షల పరిహారం

నిడదవోలు: స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం జాతీయ లోక్ ఆదాలత్ నిర్వహించారు. ఏపీ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన లోక్ అదాలత్‌లో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జి. రామకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోర్టుల్లో వివిధ కేసులున్న వ్యక్తులు రాజీమార్గం ద్వారా వాటిని పరిష్కరించుకోవాలన్నారు. వివిధ కేసుల్లో పరిహారంగా కక్షిదారులకు రూ.38.89 లక్షలు ఇప్పించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం. రవికుమార్, న్యాయవాదులు పాల్గొన్నారు.

కొవ్వూరులో 1,105 కేసుల పరిష్కారం

కొవ్వూరు: పట్టణంలోని కోర్టు ప్రాంగణంలో శనివారం నిర్వహించిన మెగా లోక్ అదాలత్‌లో 1,105 కేసులను పరిష్కరించినట్టు జిల్లా తొమ్మిదో అదనపు జడ్జి ఎన్.శ్రీనివాసరావు తెలిపారు. క్రిమినల్ 1056, సివిల్ 22, ప్రి లిటికేషన్ కేసులు 16 పరిష్కరించినట్టు వివరించారు. వాటి ద్వారా కక్షిదారులకు రూ.1,18,64,990 పరిహారం చెల్లించేలా ఒప్పందం కుదిర్చామన్నారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జి.ధర్మరాజు, ఫస్ట్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జేబీటీఎస్ దేవి,సెకండ్ అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ జి.సాయికృష్ణ పాల్గొన్నారు.

స్పోర్ట్స్ టీ షర్ట్‌ల పంపిణీ

చాగల్లు: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలోని 100 మంది క్రీడాకారులకు డాక్టర్ చినబాబు, ప్రమీల దంపతుల ఆర్థిక సహాయంతో శనివారం స్పోర్ట్స్ టీషర్ట్‌లు అందజేశారు. ఈ విషయాన్ని ఆ పాఠశాల హెచ్ఎం పి.వీర్రాజు తెలిపారు. ఈ పాఠశాల విద్యార్థులు వివిధ క్రీడల్లో రాణించి చాగల్లుకు పేరు తీసుకు రావాలని దాతలు ఆకాంక్షించారు. కార్యక్రమంలో పీడీ జె.విజయలక్ష్మి, పీఈటీ ప్రేమ్‌చంద్ తదితరులు పాల్గొన్నారు.

తుపాను బాధితులకు అండగా ప్రభుత్వం

- నిడదవోలు ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- బాధితులకు నగదు, రేషన్ పంపిణీ



కాల్దారిలో తుపాను బాధితులకు నగదు పరిహారం అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

ఉండ్రాజవరం: తుపాను బాధితులకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అండగా ఉంటుందని నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు అన్నారు. మండలంలోని కాల్దారి సొసైటీ కార్యాలయం వద్ద శనివారం తుపాను బాధితులకు నగదు, నిత్యావసరాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. గ్రామంలో ఇళ్లు కోల్పోయిన నాలుగు కుటుంబాలకు తక్షణ సహాయం కింద ఒక్కొక్కరికి రూ.10 వేల నగదు, 25 కేజీల బియ్యం, కిలో కందిపప్పు, కిలో నూనె, రెండు కేజీల ఉల్లిపాయలు, కిలో బంగాళాదుంపల చొప్పున అందజేశారు. అనంతరం గ్రామంలోని ఉమా రామలింగేశ్వర స్వామి వారిని ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు దర్శించుకుని, ఆలయంలో ఏర్పాటు చేసిన కార్తిక వన సమారాధనలో పాల్గొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య, ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి, వైస్ ఎంపీపీ చెట్టే నవీన్, సొసైటీ అధ్యక్షుడు అబ్బిన రాంబాబు, జేసీఎస్ మండల కన్వీనర్ కఠారి సిద్ధార్థరాజు, దేవస్థానం చైర్మన్ బొద్దు కృష్ణారావు, బూరుగుపల్లి శ్రీనివాసు, అబ్బిన వీవీ సత్యనారాయణ, బొందల మహాలక్ష్మిడు తదితరులు పాల్గొన్నారు.

నల్లజర్ల మండలంలో 242 మందికి..

నల్లజర్ల: మండలంలో వరద ముంపునకు గురైన 16 గ్రామాల పరిధిలోని 242 కుటుంబాలకు నిత్యావసరాల కిట్లు అందజేసినట్టు తహసీల్దార్ కిశోర్‌కుమార్ తెలిపారు. ఒక్కో కిట్‌లో 25 కిలోల బియ్యం, కిలో వంట నూనె, కిలో కందిపప్పు, కిలో బంగాళాదుంపలు, కిలో ఉల్లిపాయలు ఉన్నాయన్నారు. వరదల వల్ల పూర్తిగాను, పాక్షికంగాను గృహాలు దెబ్బతిన్న వారికి శాసనసభ్యుడి ద్వారా నగదు పరిహారం అందించే ఏర్పాటు చేసినట్టు చెప్పారు. వీఆర్వోలు, గ్రామ వ్యవసాయ సహాయకులు కలసి పంటలకు జరిగిన నష్టంపై అంచనాలు రూపొందిస్తున్నట్టు చెప్పారు. రైతులు తమ పంట నష్టం వివరాలను స్థానిక రైతు భరోసా కేంద్రాల్లో తెలియజేయాలని తహసీల్దార్ సూచించారు. కాగా మారెళ్లమూడి గ్రామంలో గృహాలు నీట మునిగిన బాధితులకు ఎంపీటీసీ సభ్యురాలు వామిశెట్టి పావనీకుమారి శనివారం బియ్యం కిట్లు అందజేశారు. ఆమెతో పాటు ఆగ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు ప్రగడ వెంకటేశ్వరరావు, రాంపండు, వామిశెట్టి పరమేశ్వరరావు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



మారెళ్లమూడిలో బియ్యం కిట్లు అందజేస్తున్న ఎంపీటీసీ సభ్యురాలు పావనీకుమారి

సంస్కరణలతో భూ సమస్యలకు పరిష్కారం

- ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- 50 మంది అసైన్డ్ భూముల సాగుదారులకు హక్కు పట్టాలు



లబ్ధిదారులకు అసైన్డ్ భూముల పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు, అధికారులు

నిడదవోలు రూరల్: భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఎన్నో సంస్కరణలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. మండలంలోని సమిశ్రగూడెం ఎంపీడీఓ కార్యాలయంలో 50 మంది అసైన్డ్ భూముల లబ్ధిదారులకు భూహక్కు కల్పిస్తూ శనివారం ఆయన పట్టాలు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో కాలంగా నివాసం ఉంటూ ఎటువంటి ఆధారం లేని పేదలకు భూహక్కు పత్రాలు అందజేస్తున్నామన్నారు. కాటకోటేశ్వరం, ఉనకరమిల్లి, శెట్టిపేట గ్రామాల్లో ఎస్సీల శ్మశానవాటికల కోసం స్థలాలను కేటాయించామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు, జేసీఎస్ మండల కన్వీనర్ వెలగన పోలయ్య, నాయకులు పులుమంతుల రామారావు, నాగిరెడ్డి సత్తిపండు, గుంటుపల్లి రామచంద్రరావు, రాపాక వెంకట్రావు, తహసీల్దార్ ఎం.గంగరాజు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బాధితులకు తక్షణ సాయం అందజేత

మిచాంగ్ తుపాను ప్రభావంతో పాక్షికంగా దెబ్బతిన ఇళ్లకు చెందిన ఆరు కుటుంబాలకు తక్షణ సాయంగా రూ.10 వేల చొప్పున చెక్కులను ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు శనివారం అందజేశారు. ప్రభుత్వం తరఫున తుపాను బాధితులకు అండగా ఉంటామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. బాధితులకు బియ్యంతో పాటు వంట నూనె, కందిపప్పు ప్యాకెట్లు కూడా అందించారు. కార్యక్రమంలో సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ అనిల్, వీఆర్వోలు, గుంటుపల్లి రామచంద్రరావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పశు వైద్య సేవలు వినియోగించుకోండి



మద్దూరులో పాడి రైతులకు మందులు, టానిక్కులు అందజేస్తున్న వెంకటరెడ్డి, సర్పంచ్ ఉప్పలూరి

కొవ్వూరు: తుపాను ప్రభావంతో భారీ వర్షాలు కురిసినందున పశువులు వ్యాధుల బారిన పడకుండా గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని పశుసంవర్ధక శాఖ కొవ్వూరు ఉప సంచాలకుడు డాక్టర్ జి.రాధాకృష్ణ అన్నారు. మండలంలోని మద్దూరులో శనివారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. వివిధ రకాల రుగ్మతలకు పశువులకు పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.41 పాడి రైతులకు ఉచితంగా ఖనిజ, లవణ మిశ్రమాలను, లివర్ టానిక్కులు అందజేశారు. ఈ శిబిరంలో 18 ఆవులు, 49 గేదెలకు వైద్య సేవలు అందించామని సహాయ సంచాలకుడు ఎ.వెంకటరెడ్డి తెలిపారు. గర్భకోశ వ్యాధి చికిత్సలు 22, నట్టల నివారణ మందులు 137, గొంతు వాపు వ్యాధి టీకాలు 96 పశువులకు అందజేశామన్నారు.సర్పంచ్ ఉప్పులూరి రాజేంద్రప్రసాద్, పశు వైద్యులు ఎం బాలాజీ శంకర్, సహాయకులు ఎం.ప్రేమ్‌కుమార్, వసంత్‌కుమార్, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

సందడిగా వన సమారాధన

దేవరపల్లి: గౌడ సంఘం ఆధ్వర్యంలో శనివారం జాతీయ రహదారిపై దేవరపల్లి–యాదవోలు మధ్య గల పామాయిల్ తోటలో నిర్వహించిన వన సమారాధన ఉత్సాహంగా, ఉల్లాసంగా జరిగింది. ఈ వేడుకలో గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కూచిపూడి సతీష్, టీడీపీ మండల శాఖ మాజీ అధ్యక్షుడు సుంకర దుర్గారావు, మండలంలోని వివిధ గ్రామాల గౌడ సంఘాల సభ్యులు పాల్గొన్నారు. ఆటపాటల పోటీలు నిర్వహించి సంఘం ద్వారా విజేతలకు బహుమతులు అందజేశారు.

పొగాకు రైతులను ఆదుకుంటాం

- పొగాకు బోర్డు ఈడీ శ్రీధర్‌బాబు
- దెబ్బతిన్న తోటల పరిశీలన



గోపాలపురంలో దెబ్బతిన్న పొగాకు తోటలను పరిశీలిస్తున్న ఈడీ శ్రీధర్‌బాబు, బోర్డు సిబ్బంది

గోపాలపురం: తుపానుకు దెబ్బతిన్న వర్జీనియా పొగాకు రైతులను బోర్డు ద్వారా ఆదుకుంటామని గుంటూరు పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు అన్నారు. తుపాను వల్ల దెబ్బతిన్న మండలంలోని పొగాకు తోటలను శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం శ్రీధర్‌బాబు మాట్లాడుతూ పొగాకు బోర్డు ద్వారా సీటీఆర్ఐ తొలుత పంట నష్టం అంచనాలు రూపొందిస్తుందన్నారు. అనంతరం పరిహారం అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. గత 40 ఏళ్లలో ఇలాంటి ఉపద్రవం రాలేదని, ఈసారి తమను ఆదుకోకపోతే ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతామని పలువురు పొగాకు రైతులు ఈ సందర్భంగా ఈడీ శ్రీధర్‌బాబుకు వివరించారు. ఈయన వెంట పొగాకు బోర్డు ఆర్ఎం ఎం. ఆదిశేషయ్య, ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, రైతు నాయకులు గద్దే శేషగిరిరావు, పిన్నమనేని మధుమోహన్, ఇల్లారి రాంబాబు, ముల్లంగి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- తాడిమళ్లలో రెండో రోజు గడప గడపకూ..



తాడిమళ్లలో సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

నిడదవోలు రూరల్: అర్హతే ప్రామాణికంగా పార్టీలు, కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. మండలంలోని తాడిమళ్ల గ్రామంలో ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, సర్పంచ్ బయ్యే రాధారాణి, వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు కటికిరెడ్డి నారాయణరావు, పార్టీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు మానుకొండ చంద్రబాబు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రెండో రోజు శనివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు మాట్లాడుతూ చంద్రబాబు హామీలకు గ్యారంటీ ఉండదన్నారు. నియోజకవర్గంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు పార్టీలో సముచిత స్థానం కల్పించామన్నారు. తాడిమళ్ల గ్రామానికి ఎంపీపీ పదవీ ఇచ్చి గ్రామాభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకున్నామని చెప్పారు. స్థానికుల సమస్యలు తెలుసుకుని వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు, ఎంపీటీసీ సభ్యుడు కొప్పుల నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ పెనుగొండ కృష్ణమోహన్, సొసైటీ అధ్యక్షుడు చింతల సీతారామయ్య, పార్టీ నాయకులు కాగిత లక్ష్మయ్య, తిరుమళ్ల దుర్గారావు, నిజంపూడి వెంకటేశ్వరరావు, పెనుగొండ సూరిబాబు, యాదల వరప్రసాద్, కొయ్యే బాబూరావు, ముప్పిడి సూరిబాబు, బయ్యే లక్ష్మణరావు, పంచాయతీ కార్యదర్శి టి.గోపాలకృష్ణ పాల్గొన్నారు.

బాధిత రైతులకు ప్రభుత్వం భరోసా



తాడిపూడిలో పర్యటిస్తున్న ఎంపీపీ, అధికారులు

తాళ్లపూడి: తుపానుకు పంటలు దెబ్బతిన్న రైతులను రాష్ట్ర ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందని ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు అన్నారు. మండలంలోని తాడిపూడి గ్రామంలో నీట మునిగిన వరి, పొగాకు పంటలను ఆయన శనివారం సర్పంచ్ నామా గోపాలం, అధికారులతో కలసి పరిశీలించారు.ఈ సందర్భంగా పలువురు రైతులు తమ ఇబ్బందులను ఎంపీపీ దృష్టికి తీసుకు వచ్చారు. రోడ్డుపై ఆరబెట్టిన ధాన్యం కొవ్వాడ కాలువ ప్రవాహ ఉధృతికి పూర్తిగా తడిసిపోయిందని వివరించారు. పొగాకు పంట పూర్తిగా దెబ్బతిందని తెలిపారు. దీనిపై ఎంపీపీ పోసిరాజు స్పందిస్తూ హోం మంత్రి తానేటి వనిత ఆదేశాల మేరకు రైతులకు నష్టం జరగకుండా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏడీఏ చంద్రశేఖర్, ఇరిగేషన్ డీఈ భాస్కరరావు, మంత్రి వనిత పీఏలు ఉమా మహేశ్వరరావు, హరీష్, సొసైటీ అధ్యక్షుడు మండిగ గిరి, రైతులు పాల్గొన్నారు.

కోతకు గురైన పుల్లలపాడు రోడ్డు



వరద ఉధృతికి కోతకు గురైన పుల్లలపాడు రోడ్డు

నల్లజర్ల: తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు మండలంలోని పుల్లలపాడు గ్రామంలోని ఊర చెరువు పొంగి ప్రవహించింది. దాంతో బైపాస్ రోడ్డు నుంచి కిలో మీటరు దూరంలో ఉన్న పుల్లలపాడు తారు రోడ్డు దాదాపు అర కిలో మీటరు పొడవునా సగానికి పైగా కొట్టుకు పోయింది. గ్రామానికి ప్రధాన రహదారి కోతకు గురవడంతో నిత్యం పుల్లలపాడు గ్రామంలోని వచ్చే రైతుల ట్రాక్టర్లు, స్కూల్ బస్సులు, పాల వాహనాలు, ఆటోల వారు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇదే రహదారి పక్కనున్న విద్యుత్తు స్తంభాలు సైతం నేల కొరిగాయి. అధికారులు స్పందించి రహదారిని యుద్ధప్రాతిపదికన పునఃనిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఉండ్రాజవరంలో యూత్ క్రిస్మస్

ఉండ్రాజవరం: ఏసుక్రీస్తు ప్రవచించిన శాంతి, ప్రేమ, సత్యం మార్గాలు మానవాళికి అనుసరణీయమని జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు అన్నారు. స్థానిక క్రీస్తు లూథరన్ దేవాలయంలో శనివారం ఆ చర్చి యూత్ ఆధ్వర్యంలో యూత్ క్రిస్మస్, దేవాలయ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి సుబ్బారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బ్రదర్ జోనా శామ్యేల్ దైవ ప్రసంగం చేశారు. అంతర్జాతీయ సువార్త గాయకుడు బ్రదర్ నిస్సీ జాన్ ఉజ్జీవకర పాటలతో దేవుని స్తుతించారు. అనంతరం యూత్ సభ్యులు చేసిన డ్యాన్స్‌లు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సంఘ పాస్టర్ ఆర్.ఇశ్రాయేల్, యూత్ ప్రెసిడెంట్ నూకపొయ్యి రాకేష్, కన్వీనర్ పి.వినయ్‌కుమార్, యూత్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కొవ్వాడ కాలువపై వంతెనలు నిర్మించాలి

తాళ్లపూడి: కొవ్వాడ కాలువలోని పూడికను, గుర్రపు డెక్కను తొలగించి ఆధునీకరించాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఫిక్కి నాగేంద్ర కోరారు. మండలంలోని కొవ్వాడ కాలువను పలుచోట్ల బీజేపీ నాయకులు శనివారం పరిశీలించారు. రాగోలపల్లి, అన్నదేవరపేట– చిట్యాల, తిరుగుడుమెట్ట గ్రామాల సమీపాల్లో పంటలు మునగకుండా, రైతులకు మేలు జరిగేలా ఈ కాలువపై వంతెనలు నిర్మించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అన్నదేవరపేట వద్ద రైతులతో కలిసి బైపాస్ రోడ్డుపై బీజేపీ శ్రేణులు కొద్దిసేపు నిరసన తెలిపాయి. కొవ్వాడ కాలువ సమస్యకు పరిష్కారం, తుపాను బాధిత రైతులకు న్యాయం జరిగే వరకూ తమ పోరాటం సాగుతుందని వారన్నారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాకలపాటి రవిరాజు, జిల్లా అధ్యక్షుడు నిడమర్తి సత్యకుమార్, ప్రధాన కార్యదర్శులు కరుటూరి జగదీశ్వర్, బొరుసు సుబ్రహ్మణ్యం, నాయకులు బూసి బెనర్జీ, తిరుమలశెట్టి కృష్ణ, కొండేపాటి సత్యనారాయణ, కిలాని రమణ, ఇండుగుల రామకృష్ణ, పలువురు రైతులు పాల్గొన్నారు.

నేడు కొవ్వూరులో కాపు వన సమారాధన

కొవ్వూరు: నియోజకవర్గ స్థాయి కాపు వన సమారాధన ఆదివారం పట్టణ శివార్లలోని నందమూరు రోడ్డులోని పెరుమళ్ల ఉమామహేశ్వరరావు గార్డెన్స్‌లో జరుగుతుంది. పట్టణంలోని కాపులంతా వన సమారాధనకు హాజరు కావడానికి బస్సు సదుపాయం ఏర్పాటు చేశామని నిర్వాహకులు శనివారం తెలిపారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. హోం మంత్రి తానేటి వనిత, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా, జనసేన పార్టీ ప్రముఖ నాయకులంతా హాజరు కానున్నట్లు తెలిపారు.